క్లుప్తంగా

వీరభద్రస్వామి కల్యాణం

శంకరపట్నం: మొలంగూర్ గ్రామంలో వీరభద్రస్వామి కల్యాణం ఆలయ పూజారి గంగాధర్ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు హాజరయ్యారు.

హనుమాన్ దేవాలయ చైర్మన్‌కు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని ఆంజనేయ స్వామి దేవస్థాన చైర్మన్ కొలిపాక శంకర్‌ను శుక్రవారం హుజూరాబాద్‌లో బీసీ సంఘ రాష్ట్ర నాయకులు చందుపట్ల జనార్దన్, సందేల వెంకన్న ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిపరిచి భక్తుల మన్నలను పొందాలన్నారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఆకుల సదానందం, నాయకులు బొంగోని వెంకటయ్య, అంతం లింగారెడ్డి, మల్లారెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్, జూపాక నరసింహచారి, తాళ్లపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం హామీలను వారు నమ్మరు

జమ్మికుంట: లిక్కర్ కుంభకోణంలో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసినప్పుడు కాంగ్రెస్ పార్టీ రాజకీయ కక్షగా మాట్లాడి, ఎన్నికల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి లిక్కర్ స్కాం సూత్రధారి కేజ్రీవాల్ అనడం ఓట్లు, సీట్ల కోసం దిగజారుడుకు నిదర్శనమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. లిక్కర్ స్కాం జరిగిందని రేవంత్‌రెడ్డి తెలుసుకున్నందుకు సంతోషమన్నారు. తెలంగాణలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, ఢిల్లీ ఎన్నికల్లో హామీల బాధ్యతపై సీఎం మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. మహారాష్ట్ర, హరియానా ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున రేవంత్‌రెడ్డి అనేక హామీలిచ్చారని, అక్కడి ప్రజలు నమ్మలేదని, ఆ పార్టీని బొంద పెట్టడం ఖాయమన్నారు. నాయకులు పాల్గొన్నారు.

జపాన్ మాస్టర్స్ శిక్షణ క్యాంపునకు ఎంపిక

వీణవంక: శ్రీరాములపేట గ్రామానికి చెందిన అంబాల హరీశ్ కరాటే మాస్టర్ జపాన్ మాస్టర్స్ శిక్షణ క్యాంపునకు ఎంపికయ్యాడు. ఈనెల 18 నుంచి 20 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో అంతర్జాతీయ స్థాయికి చెందిన ఐదుగురు జపాన్ మాస్టర్లు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, హీరో సుమన్ హాజరౌతారన్నారు. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి శిక్షణ క్యాంపునకు ఎంపిక కావడంపై మండల ప్రజలు అభినందించారు.

ఎమ్మార్పీఎస్ కళాకారుల ర్యాలీ


కేశవపట్నంలో డప్పు చప్పుళ్లతో ర్యాలీ

శంకరపట్నం: కేశవపట్నం ప్రధాన రోడ్డుపై శుక్రవారం రాత్రి ఎమ్మార్పీఎస్ కళాకారులు ర్యాలీ తీశారు. వెయ్యి డప్పులు, లక్ష గొంతుకలతో ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శంకరపట్నం మండల శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు డప్పు చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద టౌన్ సీఐ వరంగంటి రవి ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాహనదారులు హెల్మెట్, పత్రాలు, ఇన్సూరెన్స్‌తోపాటు నిబంధనలు పాటించాలని సూచించారు. అజాగ్రత్తతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటాయని, నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

వీణవంక: పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపెల్లి రాజు అనే గీత కార్మికుడు తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందికి జారడంతో శుక్రవారం తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కలవారు గమనించి చికిత్స నిమిత్తం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నవాబుపేట్‌లో క్రికెట్ పోటీలు



చిగురుమామిడి: నవాబుపేట్‌లో వారం నుంచి నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ ఏసీపీ శుభం ప్రకాశ్ శుక్రవారం తిలకించారు. ఇరు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. సామాజిక కార్యక్రమాలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ఐదు సంవత్సరాలుగా క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్న వారిని మంత్రి అభినందించారు. హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, తిమ్మాపూర్ సీఐ స్వామి, చిగురుమామిడి ఎస్సై బి.రాజేశ్, బి.శ్రీనివాస్‌రెడ్డి, బి.సురేందర్‌గౌడ్, బి.వేణుగోపాల్, బి.శ్రీనివాస్, సాగర్, రాణాప్రతాప్‌సింగ్, రఘుబాబు, శ్రీకాంత్, సాయికృష్ణ పాల్గొన్నారు.

25 నుంచి బ్రహ్మోత్సవాలు



గన్నేరువరం: ఈనెల 25, 26ల్లో శ్రీమల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వరాల పర్శరాములు తెలిపారు. శుక్రవారం గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆలయ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేశారు. 25న ఒగ్గడోలు నృత్యాలతో స్వామివారి పల్లకి సేవ, 26న మల్లన్న పెద్ద పటాలు, కల్యాణం, జాతర ఉంటుందన్నారు.
సాంస్కృతిక శాఖ నుంచి 100 మంది కళాకారులను పంపించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌ను లేఖలో కోరినట్లు డీసీసీ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి తెలిపారు. సంబంధిత లేఖను శుక్రవారం ఆలయం వద్ద చైర్మన్ వరాల పర్శరాములు, బండి రాములుకు అందజేశారు. మల్లేశం, బాలయ్య, నర్సయ్య, తిరుపతి, సత్తయ్య, పర్శయ్య, వీరయ్య, రాజయ్య, కొమురయ్య, మహేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా ఎలబోతారం


శిథిలావస్థలో ఎలబోతారం పంచాయతీ కార్యాలయం


పశువుల పాకగా మారిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

సైదాపూర్: ఎలబోతారం సమస్యలతో సతమతమవుతోంది. పాలకులు దత్తత తీసుకున్నా.. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. గ్రామం కనీస మౌలిక వసతులకు నోచుకోలేదు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం అమలు చేసేది గ్రామ పంచాయతీ మాత్రమే. ఆ గ్రామ పంచాయతీ కార్యాలయం శిథిలావస్థలో ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నూతన గ్రామ పంచాయతీ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. స్థానికంగా పాలకుల పట్టింపు కరువై నూతన పంచాయతీ భవన నిర్మాణానికి నోచుకోలేదని విమర్శలున్నాయి. గత ప్రభుత్వంలో అప్పటి హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ గ్రామజ్యోతి కార్యక్రమంలో ఎలబోతారం గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు మండలానికి వచ్చిన 40 దత్తత గ్రామమైన ఎలబోతారానికి కేటాయించారు. అవి ఇప్పటివరకు పూర్తి కాక పునాదుల్లోనే ఉన్నాయి. ఇళ్ల కోసం ఎదురుచూసిన కొందరు బేస్‌మెంట్, పిల్లర్లు నిర్మించినా.. పశువుల పాకలుగా మారారు.

సమస్యలెన్నో..

ఎన్నికల్లో వచ్చిన ప్రతి నాయకుడు తనకు ఓటేస్తే గ్రామం అభివృద్ధితో వెలిగిపోతుందంటారు. గెలిచాక ఆ గ్రామాన్ని పట్టించుకోకపోవడంతో ఆ గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నాయి. సైదాపూర్ మండలం చివరి గ్రామం ఎలబోతారం పక్క నియోజకవర్గమైన హుజూరాబాద్ పట్టణ కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామంలో ప్రజలు అభివృద్ధి కోసం నాయకులను నమ్మి ఓట్లేస్తున్నారు. గతంలో వొడితెల సతీశ్ కుమార్ అమ్మమ్మ ఊరని రెండుసార్లు ఆయనకు ఎలబోతారం గ్రామస్తులు పట్టం కట్టారు. అందుకు ఎమ్మెల్యే కోటా కింద వచ్చిన 40 ఇళ్లు ఒక్క ఎలబోతారానికే కేటాయించారు. కానీ దశాబ్ద కాలం గడిచింది. అవి నిర్మాణానికి నోచుకోలేదు. నిరుపేదల ఆశలు నెరవేరలేదు. గ్రామ పంచాయతీ భవనానికి సుమారు రూ.18లక్షలు మంజూరు చేయించారు. స్థానిక పంచాయతీ పాలకుల నిర్లక్ష్యంతో దశాబ్ద కాలంపాటు గ్రామ పంచాయతీ నూతన భవనానికి నోచుకోలేదు. శిథిలావస్థలో ఉన్న భవనం ఎప్పుడు కూలుతుందోననే భయంతో సిబ్బంది కాలం గడుపుతున్నారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు, డబుల్ బెడ్‌రూం, పారిశుధ్య పనులు, శ్మశాన వాటికకు రోడ్డు నిర్మాణం అందని ద్రాక్షగా మిగిలాయి.
గ్రామంలో అంతర్గత రోడ్లు వర్షాకాలం బురదగా మారి ఇంట్లో కాలు బయటపెట్టే వీల్లేకుండా పోతోంది. ఎండాకాలం సుడిగాలి వస్తే ఇల్లంతా దుమ్ము నిండుతుంది. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టక ఈ దుస్థితి తలెత్తుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.
ప్రభుత్వ పథకాలు ఎలబోతారం దరి చేరడం లేదని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి దూరమైన ఎలబోతారం గ్రామస్తులు గత ఎమ్మెల్యే ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మద్దతిచ్చారు. కాంగ్రెస్‌కు మెజార్టీ ఓట్లు వేశారు. గ్రామంలో పేరుకుపోయిన సమస్యలు మంత్రి పరిష్కరిస్తారనే ఆశల్లో ఎలబోతారం గ్రామస్తులున్నారు.

మంత్రి దృష్టి సారించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించి ఎలబోతారాన్ని అభివృద్ధి చేయాలి. గ్రామ పంచాయతీ భవన నిర్మాణం చేపట్టాలి. గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్లు పునాదుల్లోనే ఉన్నాయి. ప్రజా ప్రభుత్వం మంజూరు చేయించే ఇందిరమ్మ ఇళ్లకు స్థలం లేని వారికి ఆ స్థలాన్ని కేటాయించాలి. కనీస మౌలిక వసతులకు నిధులు మంజూరు చేయించాలి. హుజూరాబాద్–హుస్నాబాద్ ప్రధాన రహదారికిరువైపులా డ్రైనేజీ నిర్మించాలి.
– చొప్పరి రవీందర్, ఎలబోతారం



చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాలకు హుస్నాబాద్ ఆర్టీసీ బస్ డిపో నుంచి ప్రజల సౌకర్యార్థం బస్సులు నడుస్తున్నాయి. హుస్నాబాద్ నుంచి కొండాపూర్–సుందరగిరి ద్వారా బొమ్మనపల్లి నుంచి హుజూరాబాద్ మార్గాల్లో బస్సులు నడుస్తున్నాయి. హుస్నాబాద్ నుంచి సుందరగిరి, చిగురుమామిడి, చిన్నముల్కనూర్ ద్వారా కరీంనగర్ జిల్లా కేంద్రానికి ప్రతిరోజు ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. ఈ క్రమంలో బస్ డ్రైవర్లు కొందరు సమయపాలన పాటించడం లేదు. ఒక్కోసారి రెండేసి, మూడేసి బస్సులు ఒకదాని వెంట మరోటి వస్తున్నాయి. మరోసారి ముప్పావు గంట వరకు కూడా బస్సులు రాక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వస్తే ఒకేసారి లేకుంటే రావంటూ పలువురు విసుక్కుంటున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు బస్సు వేళలను పరిశీలించాలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

సీఎంఆర్‌ఎఫ్‌తో భరోసా


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: అనారోగ్యంతో బాధపడుతూ ప్రమాదాల్లో గాయపడి ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసానిస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 90 మంది లబ్ధిదారులకు శుక్రవారం రూ.28,50,306 విలువ చేసే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి, గంగాధర సింగిల్‌విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు తోట కరుణాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురమల్ల మనోహర్, నాయకులు దుబ్బాసి బుచ్చయ్య, రాజగోపాల్‌రెడ్డి, రామిడి రాజిరెడ్డి, గన్న, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, విద్యాసాగర్‌రెడ్డి, సత్తు కనకయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


ఎమ్మెల్యే చిత్రపటాన్ని గాడిదపై ఊరేగిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లూరి రాహుల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను గాడిదపై ఊరేగిరపుగా తీసుకొచ్చి దహనం చేశారు. రాహుల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలను స్థాయికి మించి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి విమర్శిస్తున్నాడని దుయ్యబట్టారు. మండల అధ్యక్షుడు కొల్లూరు కిరణ్, దేవస్థాన చైర్మన్ కొలిపాక శంకర్, కిరణ్‌రెడ్డి, నాయకులు ప్రతాప నాగరాజు, ఇప్పలపల్లి చంద్రశేఖర్, ఆలేటి సుశీల, యేముల పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం


హుజూరాబాద్‌లో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫ్లెక్సీకి బీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే ప్రశ్నిస్తుంటే గిట్టని కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మ దహనం చేశారన్నారు. కాంగ్రెస్ నాయకులు చేసినట్లుగా తాము కూడా సీఎం దిష్టిబొమ్మను జంతువులపై పెట్టి ఊరేగింపు చేయొచ్చు కానీ అది సంస్కారం కాదన్నారు. హర్షద్, ఇర్ఫాన్, భరత్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

తిమ్మాపూర్: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే వెయ్యి గొంతులు.. లక్షల డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సిరిసిల్ల శంకర్, సిరిసిల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కరీంనగర్ నుంచి చేపట్టిన ప్రచార రథయాత్ర అల్గునూరుకు చేరుకుంది. ముఖ్య అతిథిగా రామంచ భరత్ హాజరయ్యారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కులాలు, మతాలకతీతంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించాలన్నారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, కళాకారుల జిల్లా అధ్యక్షులు అంబాల ప్రభు, సిరిసిల్ల శంకర్, సిరిసిల్ల శ్రీనివాస్, బోయిని కొమురయ్య, ఖమ్మం కృష్ణ, గాజా సాగర్, వంతడుపుల సంపత్, కన్నం నర్సయ్య తదితరులున్నారు.

దాడులకు ప్రతి దాడులు చేస్తాం

మానకొండూర్: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ నాయకులపై దాడులు చేస్తే సహించేది లేదని, దాడులకు ప్రతి దాడులు చేస్తామని బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ అన్నారు. మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. నీటి పంపిణీ విషయంలో నిలదీస్తే సమాధానం చెప్పకుండా మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ ఇంటిపై దాడి చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. రాజకీయ సంస్కృతిని భ్రష్టు పట్టిస్తున్న కాంగ్రెస్ గుండాలకు తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.

మా దరఖాస్తులెక్కడ!

- ఇందిరమ్మ దరఖాస్తుదారుల ఆవేదన
- సర్వే జాబితాలో కనిపించని పేర్లు
- ప్రతీ డివిజన్‌లోనూ బాధితులు

'నగరంలోని 22వ డివిజన్ పరిధిలోని సుభాష్‌నగర్‌కు చెందిన కదారి స్వరూప ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఎన్నికల హామీ మేరకు ఆరుగ్యారంటీలకు సంబంధించి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించడం తెలిసిందే. 2023 డిసెంబర్ 29వ తేదీన స్వరూప ప్రజాపాలన దరఖాస్తు (కేఎస్ఆర్/22/టీ1/151) అందచేశారు. ఆమెకు గ్యాస్ సబ్సిడీ కూడా వస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించిన సర్వే జాబితాలో మాత్రం ఆమె పేరు లేదు. తాను ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నానని, జాబితాలో తన పేరు ఎందుకు రాలేదని అధికారుల చుట్టూ తిరిగినా, చివరకు కలెక్టర్‌ను కలిసినా ఫలితం కనిపించడం లేదని వాపోయింది.'

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి కావస్తోంది. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా డివిజన్ల వారీగా రూపొందించిన జాబితా ప్రామాణికంగా ఉద్యోగులు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. ఆ జాబితాలో వందలాది మంది దరఖాస్తుదారుల పేర్లు లేకపోవడం వివాదాస్పదమవుతోంది. ప్రజాపాలన దరఖాస్తుల్లో తాము ఇందిరమ్మ ఇండ్లు కావాలని మార్క్ చేసినప్పటికి, జాబితాలో తమ పేర్లు లేకపోవడమేమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. దరఖాస్తుదారుల జాబితాలో పేర్లు ఉంటేనే సర్వే చేస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. తమకు ఇచ్చిన పేర్ల ఆధారంగా ఆ చిరునామాలకు వెళ్లి సర్వే చేస్తున్నామని, జాబితాలో లేని పేర్ల గురించి తమకు తెలియదంటున్నారు.

దరఖాస్తులేమయ్యాయి

ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన చాలా దరఖాస్తులు సర్వే జాబితాలో కనిపించకుండా పోవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. దాదాపు అన్ని డివిజన్‌లలోనూ ఈ సమస్య నెలకొంది. తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డులతో పాటు అన్ని వివరాలు ఇచ్చామని, ఇతర పథకాలు వర్తించినప్పుడు ఇందిరమ్మ ఇంటి దరఖాస్తు మాత్రం ఎటుపోతుందని బాధితులు ప్రశ్నిస్తున్నారు. సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల నెరవేరుతుందని ఎదురుచూస్తున్న సమయంలో తమ దరఖాస్తులే లేకుండా పోవడం పట్ల బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సర్వే జాబితాలో దరఖాస్తులన్నీ వచ్చేలా చూడాలని వారు కోరుతున్నారు.

ముగిసిన టెండర్ల గడువు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో సుడా నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ గడువు ముగిసింది. రూ.1.97 కోట్లతో 18 పనులకు సంబంధించి ఇటీవల టెండర్ పిలిచారు. బిడ్ దాఖలు గడువు శుక్రవారంతో ముగిసినందున శనివారం టెక్నికల్ బిడ్ ఓపెన్ చేయనున్నట్లు సమాచారం.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్‌జీవో సంఘం నాయకులు

కరీంనగర్: టీఎన్‌జీవోల సంఘం నాయకులు శుక్రవారం కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 20న జరిగే ఉద్యోగుల స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంతో పాటు టీఎన్జీవోల సంఘం జిల్లా డైరీ ఆవిష్కరణకు హాజరు కావాలని కోరారు. అదేవిధంగా అడిషనల్ కలెక్టర్‌లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో కె.మహేశ్వర్, మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పేయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కౌన్సిల్ సమావేశానికి ఆహ్వానించారు. టీఎన్‌జీవో నాయకులు దారం శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్‌రావు, కిరణ్‌కుమార్‌రెడ్డి, హర్మీందర్‌సింగ్, రాజేశ్, భరద్వాజ్, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.
కరీంనగర్ కార్పొరేషన్: ఇటీవల ఆర్‌టీఏ సభ్యుడిగా నియమితులైన పడాల రాహుల్ శుక్రవారం కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేశారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు, రవాణాశాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

క్షయరహిత తెలంగాణకు కృషి చేయాలి

సైదాపూర్: క్షయ(టీబీ)రహిత తెలంగాణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీబీ నోడల్ పర్సన్ రమేశ్ అన్నారు. శుక్రవారం ఎలబోతారం, రాములపల్లి, రాంచంద్రాపూర్ గ్రామాల్లో 100 రోజుల టీబీ నిక్షయ్ సివియర్ మెగా మొబైల్ క్యాంపెయినింగ్ నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు, బరువు కోల్పోవడం, రాత్రివేళల్లో జ్వరం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్పూటమ్ టెస్టు చేయించుకోవాలని సూచించారు. వయస్సు పైబడిన వారు దుమ్ము, ధూళికి దూరంగా ఉండాలని, టీబీ సోకే ప్రమాదం ఉందన్నారు. టీబీ సోకిన వారికి ఆరు నెలలకు సరిపడా మందులు, నెలకు రూ.వెయ్యి అందజేస్తారని అన్నారు. హుజూరాబాద్ టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

సెరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా మహమ్మద్ రషీద్



హుజూరాబాద్: సెరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా మహమ్మద్ రషీద్ పదోన్నతి పొందారు. రషీద్ హన్మకొండ జిల్లాలో రెండు సంవత్సరాలు పని చేసిన అనంతరం డిప్యూటేషన్‌పై హుజూరాబాద్‌లో సెరికల్చర్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. జూలై 2024 నుంచి జిల్లాలో ఒకేఒక అధికారిగా పట్టు సాగు చేస్తున్న రైతులకు సలహాలు, సూచనలు అందిస్తూ పట్టు పరిశ్రమ అభివృద్ధికి కృషి చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చిన్నపాపయ్యపల్లి, రంగాపూర్ గ్రామాలకు ప్రత్యేక అధికారిగా పని చేశారు. శాఖాపరమైన అర్హతలున్నందున రషీద్‌కు సహాయ పట్టు పరిశ్రమ అధికారిగా పదోన్నతి కల్పిస్తూ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ యాస్మిన్ భాష ఉత్తర్వులు జారీ చేశారు.

కబ్జా నుంచి రోడ్డును కాపాడండి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆటోనగర్ వాసులు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని ఆటోనగర్‌లో కబ్జాకు గురవుతున్న రోడ్డును కాపాడాలని కోరుతూ కోతిరాంపూర్, ఆటోనగర్ కాలనీ వాసులు శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. 9వ డివిజన్ పరిధిలోని ఆటోనగర్‌లో రోడ్డు కబ్జాకు గురవుతుందంటూ 'ఆ డివిజన్‌లో రోడ్లు మాయం' శీర్షికన ఈనెల 13న 'సాక్షి' కథనం ప్రచురితమైన క్రమంలో కోతిరాంపూర్, ఆటోనగర్‌కాలనీ వాసులు మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య ఆధ్వర్యంలో కమిషనర్, ఏసీపీ వేణులకు ఫిర్యాదు చేశారు. 40 ఏళ్లుగా ఉన్న ఈ రోడ్డును ఆక్రమించేందుకు భవన వ్యర్థాలను పోశారని, ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం నగరపాలక సంస్థకు దరఖాస్తు చేశారని కమిషనర్‌కు వివరించారు. పక్కనే ఉన్న స్థల యజమానుల రిజిస్ట్రేషన్ పేపర్లు చూసినా ఈ రోడ్డు ఉన్నట్లు తెలుస్తుందని అన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి, కబ్జా దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య, ఆటోనగర్ యూనియన్ అధ్యక్షుడు ప్రకాశ్, ఉమేశ్, మహేందర్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.